పతిపత్న్యనుగమనము

వేలాల సుబ్బారావు గారు

౧

ప్రస్తుతం గడుస్తూ ఉన్న ఆంగ్లేయయుగంలో ఆదివారం వస్తుందీ అంటే ఏదో ఒకవిధమైన ఆనందం గలిగి గులాంగీర్ల కందరికీ మనఃశల్యం వాసిపోయినలా గుంటుంది. ఆ ఒక్కనాడైనా నిరంకుశాధికారం జెల్లించే ఆఫీసర్ల ధిక్కారింపు చేతలనుంచీ, వారి రోత కూతలనుంచీ ముక్తినొంది, భగవంతుడు ప్రసాదించిన స్వేచ్ఛా వాతావరణంలో విహరిస్తూ, నిర్మలమైన వాయువును సేవిస్తూ ఆనందించవచ్చును గదా అని దాస్యదేవతారాధన మొనరించువారందరూ సంతోషిస్తూ వుంటారు ఆదివార మంటేనే. శ ని వా ర ం నా డు మధ్యాహ్నానంతరం ఒకటి రెండుగంటలు దాటాయి అంటే చాలు, మరునాటిఛాయలు మీదబడి సేవాసదనా లనే ఫ్యాక్టరీల్లో గుక్కతిరక్కుండా మెషీను చక్రాల్లాగు పనిచేస్తూ ఉండే దాసజనబృందాల పరితప్తహృదయాలకు చల్లని శాంతిని గలుగజేస్తూ ఉంటాయి. సర్కారు నౌకరీవశాన్ని పరస్పరం వేర్వేరు గ్రామాల్లో దూరదూరంగా ఉండడం తటస్థించిన భార్యాభర్తలు ఆదివారానికే ఎదురుచూస్తూ ఉంటారు, అది ఎప్పుడు వస్తుందా, ఎప్పుడిద్దరం గలసి ఒకరికష్టసుఖము లొకరితో చెప్పుకొందుమా అని. సంవత్సరాల పర్యంతం ఇరుకైన అద్దెకొంపలే శరణాలయాలు కావడంవల్ల సాధారణోద్యోగస్థుల పరివారాలన్నీ ఆదివారాన్నే జపిస్తూ ఉంటాయి, ఆనాడైనా యీగుహాల్లోనుంచి వెలుపలికి దీసి బాహ్యప్రపంచం జూపిస్తారుగదా మావా రనీ. ఇక నిద్రాలసలైన గృహలక్ష్ముల కందరికీ ఆదివారమంటే అట్లతద్ది వచ్చినట్లే. 8 లేక 8½ గంటలయ్యే సరికే ఏముక్కనో, నోటనోయిన్ని మెతుకులు కొట్టుకొని కచేరీలకు వేళకు హాజరు గాకపోయినయెడల మగల నౌకరీ లెక్కడ ఊడిపోతాయో అనే భయంచేత పాపం ప్రతిదినమూ తెల్లవారుగట్లే వెన్పవెన్పని పక్కల వదలవలసివచ్చేది వీరికి. ఆదివార పుణ్యమా అంటూ యీలాంటివాళ్లంతా ఆనాడు పొద్దు ఎంత ఎక్కిందీ తెలియకుండా గురకలు కొడుతూ ఉంటారు. ఇదానీం తన భారతీయపౌరజన, పౌరస్త్రీల స్థితిగతు లిట్లా ఉంటాయి, కొంచెం హెచ్చు తగ్గుగా. అందరికీ ఆదివార మంటే ప్రేమే.

ఇకముందు పౌరులు గాబొయ్యేవారూ, వారిని ఆపదవులకు తయ్యారుచేసే ఉపదేశకులమా టేమిటీ? వారూ ఈవారాన్ని అభినందిస్తూనే ఉంటారు. ఎల్లుండి ఆదివార మనగానే పెద్దపెద్దమాస్టర్లకే పరమానందమై పోతుండంటే ఇక పిల్లకాయల సంగతి ఏం చెప్పాలీ? స్కూలువాళ్లకు శుక్రవారపు సాయంకాలం మీదే వాలుతూ ఉంటాయి, ఆదివారపు శీతలచ్ఛాయలు. ఆదివారపు పేరు స్మరించుకొంటూ ఉస్తాదులు కొందరు శుక్రవారంనాటి ఆఖరు పిరీడ్లకే తాంబూలం వేస్తూ ఉంటారు. ఇక కాలేజీల్లో చదివే యీడువచ్చిన విద్యార్థులఆనందానికి పార మే లేదు. సముద్రం అపార మంటారు; అదినట్టి అబద్ధము. ఏ మహాసముద్రాన్ని తీసుకొన్నా పారాలు తగులుతూనే ఉంటాయి. కాబట్టి అపారమైన దేదైనా ఉన్నదంటే అది కాలేజీస్టూడెంట్లకు గలుగు ఆదివారాగమన శ్రవణజనిత మహానందసాగరమే. ఇతరేతరజాతిమైత్రి గల విద్యార్థులకు—అనగా విద్యార్థినుల సఖ్యముగల విద్యార్థులకూ, విద్యార్థుల సఖ్యముగల విద్యార్థినులకూ—శరీరాలు గగుర్పొడుస్తూ వుంటాయి, ఆదివార ప్పేరు వింటేనే. పరిజృంభమాణ సాహసోత్సాహపూరితములైన వీరి మనోనేత్రాల్లో గిర్రున దిరుగుతూ ఉంటాయి, లవ్ పార్కులూ, సినీమాలూ, థియేటర్లూ, సముద్రతీరాలూనూ. అందులో యెహోవా అనుగ్రహపాత్రుల భాగ్యమే భాగ్యం; దేవుడీ ఆదివారాన్ని దమకోరకే నిర్మించి ఉంటాడనే నిండు కృతజ్ఞతతో క్రైస్తవయువతీ యువకులు—

ముఖ్యంగా బరస్పరానురాగం గలవారు, ఎంత నిశ్చలమైన, ఎంత నిష్కపటమైన, ఎంత నిర్మలమైన హృదయంతో వర్జిన్ మేరీని ప్రార్థిస్తూ ఉంటారో అంతటి శ్రద్ధాభక్తులతో వయసుగడచిన పాదిరీసైతం ప్రార్థించజాల డనుకొంటాను. ఇట్టి మేరీ ధ్యానపరాయణులైన మిస్సమ్మల దయాధర్మముల మూలమున ఆనాడు సగం కడుపైనా నిండుతుందిగదా అని రెండుకాళ్ల రిక్షా గుర్రాలుగూడా గుటక లేస్తూనే ఉంటాయి, ఆదివారం వస్తూఉందీ అంటే. చర్చికి వెళ్లవలసినప్పుడు ధరింపవలసిన డ్రెస్సు వగైరాల ఏర్పాట్లన్నీ ఒకటి రెండు రోజులు ముందుగనే నిష్కర్ష అయివుంటాయి. ఇందువల్లాన్ని మంచి మంచివెల, పొడుగు దుస్తులను కొద్దిపాటి బాడుగల కిచ్చే చాకలవాళ్లకూ సంతోషమే ఆదివారం వస్తుందీ అంటే. ఇంతకూ మన గ్రహచారమనాలికాని వేరుకాదు. గీర్వాణం నిర్వాణ మందితే హూణహూణమై పోయింది గాని, యుగమంతా జగమంతా, లేకుంటే ఆదివారం మాహాత్మ్యమనే పురాణం వెలువడకపోయిందీ, ఈపాటి కేకుశాగ్రబుద్ధి ప్రయత్నంవల్లనైనా! ఆయుగాంతం యెహోవా ఆదివారంనా డీలాగే విశ్రాంతిదీసుకొనుచుండుగాక.

ఈప్రకారం సమస్తమైనవారికీ ఆనందం సమకూర్చే రవివారం సూర్యాతపఖిన్నులకు చంద్రోదయంలాగు ఉదయమై సుమారు 7 గంటలు కావచ్చేసరికి మద్రాస్-బెజవాడా 22 నెంబరు డౌను పాసెంజరు సెగలు పొగలు జిమ్ముకుంటూ వంగోలు ప్లాట్‌ఫారం మీదికి వచ్చి ఆగింది. వెంటనే ఇండియన్ జంటిల్ మెన్ రిజర్వ్‌డు వెహికల్ (Indian gentlemen reserved vehicle)ఒకథర్డుక్లాసుకుక్కలోనుంచి మూటాముల్లె చేతబట్టుకొని అందరితోపాటు కిందికి దిగాడు ఒక పెద్దమనిషి. ఇతని పేరు గోపాలరావు. మంచిరంగూ, రూపం—28 ఏండ్లునయసూ. దైన్యమిళితములైన శాంతసాధు దయాస్వభావా లీయనమొగంమీద ప్రత్యక్షమవుతూఉన్నాయి. కాని రవంత ఆనందాభాసంగూడా వుంది ఆమిశ్రణంలో. సర్కారునౌకరీలవల్ల వేర్వేరు ప్రదేశాల్లో వుండడం తటస్థించిన భార్యాభర్త లాదివారంకోసం నోరుతెరచుకొని చూస్తుంటారని వ్రాశానుగదా. ఈశ్రేణికి జెందినవాడు మనగోపాలరావు. ఈయన యం. యస్. యం. రైల్వేవారి హెడ్డాఫీసులోని ఆడిట్‌విభాగంలో ఒక క్లర్కు. నలభైరూపాయల మాసికం. మద్రాసులోని సంపాదన అద్దెయిళ్లకూ, కాఫీ హోటళ్లకూ, పూటకూళ్లకూ సరిపోతే అసలువళ్లైనా ఆరోగ్యస్థితిలో నిలుపుకొనగలిగినవాళ్లను చాలా అదృష్టవంతులనే ఎంచవచ్చును.

ఆదాయంలో మూడోవంతు పెడితేనే గాని ఒక మాదిరికొంప దొరకదు. లోభించి యింతకు దక్కువకు తీసుకొన్నామా అంటే తతిమ్మామొత్తం యావత్తూ డాక్టరుగారి బిల్లులకు చెల్లుబడి అనుకోవలసిందే. కాబట్టి మద్రాసులో కాపురంపెట్టడానికి తాకత్తుచాలక, ముందెప్పుడైనా జీతంలో ప్రమోషన్ అయితేగియితే చూచుకొందామని భార్యను ఇతడు స్వగ్రామంలోనే ఉంచి, వీలైనలాగు నెలకో, వారానికో వెళ్లి ఆమెను చూచి వస్తూ ఉంటాడు. కారణాంతరాలవల్ల గడచిన రెండు మూడు ఆదివారములకు వెళ్లడానికి వీలైందికాదు. ఇక నిప్పుడు కొంచెంసేపటిలో తన ప్రేయసిని గలుసుకొంటాను గదా అని దాస్యదీనతాహతమైన ముఖంమీద రవంతసంతోషరేఖ కనబడుతూ ఉంది.

౨

వంగోలుకు దూర్పుగా రెండు కోసులదూరంలో ఉన్న మలకలచెరువ్వగ్రామం మన గోపాలరావు నివాసస్థలము. ఈ వూరికి వుత్తరంగా నాలుగైదుమైళ్ల వైశాల్యం గల పెద్దపంట చెరువు ఒకటి ఉంది. ఇది దక్షిణ హైదరాబాదుసిటీ-నుంచి నిజాంగారి ఫలక్‌నుమా మహలుకు వెళ్లే మార్గంలో ఉన్న మీరాలం సరోవరంలాగు మెలికలు మెలికలుగా ద్రవ్వబడివున్నందువలన చెరువు కట్టగూడా అదేమాదిరిగా ఉంటుంది. ఈకారణంచేత దానికి మలకలచెర్వనీ, దాన్నుంచి గ్రామానికీ అదే పేరు వచ్చిందనీ జనపరంపరగా వస్తూవున్న ప్రవాదమొకటి ప్రసిద్ధమై ఉంది. కాని ఎపిగ్రాఫియా డిపార్టుమెంటువారికి ఏరాళ్లరప్పల ఆధారాలు దొరికాయో తెలియదు: హీరు, విజయనగరభాను డస్తమించిన తరువాత గోల్కొండవారి పక్షాన్ని వచ్చిన తురకనవాబు

లెవరో దానిని ద్రవ్వించారనీ, వారు మలకలనే పేరును గలిగియుండినందున దాని కాపేరు వచ్చిందనీ ఒకకొత్త సిద్ధాంతం ప్రకటించారు. కానీండి! ఈ గొడవంతా మన కెందుకూ? ఉత్పత్తివిషయంలో అభిప్రాయభేదాలున్నా, చెరువుపేరూ, దానివలన గ్రామానికి పేరు రావడం-ఈ విషయాల్లో ఈ రెండు పక్షాలవారి మతం ఒక్కటే—అదే మనకు గావలసినది. ఇంత యెందుకూ, గ్రామానికి ఉత్తరంగా ఒకపెద్దచెరువువుందని జ్ఞాపకముంచుకొండి, అంతే చాలు. ఈ గ్రామంలో గోపాలరావుపూర్వులు కట్టించిన ఒక మంచి మిద్దె ఇల్లువుంది. మద్రాసులో అద్దెకొంపల భరించడం కష్టం వకటీ. రెండోది గ్రామంలోని యింటిని బొత్తిగా వదిలేస్తే ఎలుకలూ, పందికొక్కులూ ప్రవేశించి కిందా మీదా గుల్లచేసిపారేసిన సమయంలో వర్షం కురిసిందా అంటే కప్పునాల్గుమూలలనుంచీ సహస్రముఖాల ఆకాశగంగాధార లారంభమై చూస్తూచూస్తూ ఉండగానే యిల్లు నేలగూలి ఊరుకొంటుంది. కాపురముండి ఎవరైనా యింట్లో దీపంపెట్టుకొంటూ ఉంటే ఈ అనర్థాలన్నీ జరగవని ఒకటీ—ఏకారణమైతేనేం, గోపాలరావుభార్య సీతమ్మ ఇంటిపట్టునే ఉంటూవచ్చింది. కాని ఎప్పుడు మగనికి కొంచెం ప్రమోషనవునా, ఎప్పుడు తనభాగ్యం పండునా అనేకోరిక ఈమెకు లేకపోలేదు. ఈకోరిక మరింత ప్రబలంకావడానికి కారణంగూడా ఒకటి కలిగింది కొత్తగా. వెనుక గోపాలరావుపనిచేసే ఆడిట్ విభాగానికంతా ప్రముఖుడుగా ఉండిన జాక్సన్ ఆరోగ్యంతప్పి, సం॥ సెలవుపుచ్చుకొని ఇంగ్లండుకు వెళ్లుతూ, గోపాలరావంటే రవంత అభిమానం కావడంవల్ల తిరిగి రావడంతోటే కొంచెం జీతం ఎక్కువగాగల మరోపనిలోకి లాక్కుంటామని వాగ్దానమిచ్చి మరీవెళ్లారు. ఆ వాగ్దానం నెరవేరితే సీతను వెంటబెట్టుకొని వెళ్లి తనదగ్గర ఉంచుకొని స్వంత యింట్లో ఏగృహస్థునైనా బతిమాలుకొని ఉచితంగా ఉంచుదామనేఉద్దేశంతో పోయినతడవచ్చినపుడు భార్యకీవిషయాలన్నీ తెలిపి ఆమెను చాలాసంతోషపెట్టాడితను. మూడువారాల కిందటే దొరగారు వచ్చి చార్జీపుచ్చుకోవలసింది కాని రాలేదు. వారు వచ్చినతరువాత కొత్తనౌకరీలో జేరి మరీ వెళ్లవచ్చునుగదా అని ఇంటికి గూడా వెళ్లలేదితను పోయిన రెండువారాల్లోనూ. తీరా మూడువారాలు గడిచేసరికి దొరగారు మరిమూడునెలలు సెలవును అభివృద్ధిచేసుకొన్నారని తెలిసింది. అంతటితో ఆశలన్నీపోయి ఇంటికి బయలుదేరాడు. పాపం సీత కేం తెలుసూ ఇదంతా. పెనిమిటి రాక ఆలస్యం చేస్తూవుంటే, అదంతా కొత్తపనిలో చేరి తను నిమిత్తం ఇంటిని లోనగువానిని ఏర్పాటుచేయడానికే అని నిశ్చయించుకొని, తన నిక దప్పకుండా వెంట బెట్టుకపోతారని మహాసంతోషంగా ఉందీ అమాయకురాలు.

గోపాలరావేలాగో డొక్కశుద్ధి గావించుకొని మద్రాసులో నౌకరీకి కుదిరాడుకాని, ఇతని తండ్రి తాతలు షట్కర్మనిరతులు, సాధుస్వభావులు, విద్వాంసులునై గ్రామస్థులందరికీ పూజ్యులై ఉండినందున, వారిప్పుడు లేకపోయినప్పటికీ, ఊరివారుమాత్రం ఆకుటుంబం యెడల బూజ్యభావమే కలిగియుండిరి. ప్రస్తుతం దక్షిణ భారతములోని హిందూసంఘ వృక్షరాజమునకు వేరు పురుగనదగిన అబ్రాహ్మణ బ్రాహ్మణ కలహం అప్పటికి మొలకెత్తి ఉండలేదు. కాబట్టి గ్రామస్థులందరూ గోపాలరావును ఇంటిదగ్గరే ఉండమనీ, తండ్రి తాతల నాటివలె సేకొదవ లేకుండా ఇంటిఖర్చులన్నీ జరుపుతామని చాలా పర్యాయాలు వేడుకొన్నారు. కాని ఉద్యోగం పురుషలక్షణమైనందువల్లా, క్రైస్తవ వింశతి శతాబ్దంలో భారతీయుల కాఉద్యోగమనేది కేవలం సర్కారునౌకరీ కావడంవల్లా ఇతడు వారిమాటలను పాటింపక రైలుఆఫీసులో గొలువుకు గుదిరాడు.

గ్రామస్థులందరూ సీతను సీతాదేవిగనే భావిస్తూ ఉంటారు. పతిభక్తి పరాయణులైన సాధ్వీమతల్లులు సూర్యచంద్రులనుగూడ స్వాధీనముచేసికొని యుండుట నిజమో కల్లో మనకు దెలియదు. కాని మలకలచెరువువాసు లందరూ ఈమెసుగుణగణములకు వశీభూతులై అపరదేవియనియే భావిస్తూవుంటారు. మూర్తీభవించిన ప్రాచీన నవీనాచారాల సమ్మేళనం సీత. కావున ఇరు పక్షములవారికీ స్తుతిపాత్రయే యైన దీదేవి. ఈపరమా

త్మని పవిత్రమందిర మీభూతలమున జనించి పంచవింశతి శరత్తులు కడచిపోయినవి; కాని సర్వకాల సర్వావస్థలందు, ముఖ్యముగ నిజకాంతుని అనుపస్థితివేళలందు, స్వర్గీయఆనంద మాపాదించు నామె దానోపవాసవ్రతాది పుణ్యఫలముల ప్రోవు సంతానరత్నముయొక్క కోమలగాత్ర సంస్పర్శనసౌఖ్య మీలలనామణిపాణిపల్లవాల కింకనూ కలిగియుండలేదు. అట్టి కుమారబ్రువుని నక్కున నెత్తుకొని పాలుగారు లేతబుగ్గలరసము నాస్వాదింప పరితపిస్తూ ఉంటుంది ఈసతీ తిలకము నవసరోరుహ పరిమళయుక్తమైన ఓష్ఠయుగ్మము. కాని దైవానుగ్రహం లేనపుడు మనుష్యవాంఛ లేమి చేయగలవు? కడచిన రెండు మూడువారాల్లో, మీద నుదాహరించిన ప్రకారం, పెనిమిటి రానందున మరింత ఉత్కంఠాపూర్ణయై, తెల్లవారుగట్లే లేచి ఇంటి పనులన్నీ చక్కబెట్టుకొని సూర్యోదయమైంది మొదలుకొని తదేకధ్యానంతో నతనికొర కెదురు చూస్తూఉం దీమె. సుమారు 8 గంటలు కావచ్చును. కూలివాడు మూట నెత్తుకొనిరా గ్రామం ప్రవేశించగానే కలిసిన మిత్రులతో మాట్లాడుకొంటూ వచ్చి గోపాలరావు యింటిగుమ్మ మెక్కగానే ఇతని జూచి యామెముఖం ప్రభాతకాలకమల మైంది. మిత్రులతోపాటు వసారాలోని అరుగుమీద వేసిఉన్న చాపమీద నితడు కూచోగానే కాళ్లు కడుక్కోడానికి నీళ్లు తెచ్చిపెట్టి వెళ్లిపోయింది. అయిదారు నిముషాల పర్యంతకాలంలో మిత్రమండలివారి ఉభయకుశలప్రశ్న లయిపోయినాయి. కాళ్లు కడుక్కొనుటకు గోపాలరావు లేవడంతోటే మళ్లీవచ్చి కలుస్తామని చెబుతూ స్నేహితు లెవరిండ్లకు వారు వెళ్లారు. అంత నితడును పాదప్రక్షాళనం జేసుకొని లోపలికి వెళ్లగానే సీత ఎదురుగా వచ్చి, "పోయిన రెండువారాల్లో వచ్చారు గారేం?" అంది.

"నీవంటిదేవీసందర్శనం ఎల్లప్పుడూ జేసుకొనే భాగ్యం నాలాటి దరిద్రులకు ఉంటేకాదూ?"

అని అనగానే సిగ్గుచేత చప్పున దలవంచుకొని ఏమో అనబోతూవున్న భార్యను తన చేతుల్లోనికి లాక్కొని కృతజ్ఞతా జనితానందబాష్పముల నామెపై రాలుస్తూ "నిజం సీతా! నేనన్నది అబద్ధంకాదు. నీముఖపద్మం చూసేసరికి నామనోవ్యాకులన్నీ పరుగెత్తిపోతాయి. నీసముఖమే నాకు స్వర్గం. నీచెంత నున్నంతకాలమూ నాకు ఆఫీసులోని చర్యలూ, అధికార్ల కటువాక్యాలూ, నావంటివాళ్లకు గలిగేతలవంపులూ, అధోగతులూ, అసహాయస్థితులూ, ఈలాటివి ఏవీ జ్ఞాపకానికి రావు. నెలల పర్యంతం అనుభవింపక తప్పనియాతనలన్నీ నిన్ను జూడగానే పటాపంచలయిపోతాయి. నాపూర్వజన్మకృత పుణ్యఫలరాశివి నీవు లేకుంటే నాగతి యేమగునా యని పలుమారు తలపోసుకొంటూ వుంటాను. కాని సీతా! నిన్ను దీసికెళ్లి దగ్గిర బెట్టుకొని సౌఖ్యపడదామనే నాప్రయత్నాలన్నీ విఫలమే అవుతున్నాయి. ఈజన్మలో నెరవేరుతుందో నెరవేరదో ఆనాకోరిక—"

ఈమాటలను వినగానే ఆమెహృదయం కలుక్కుమన్నది. కొంచెం నెల్లబారిన ముఖంతో, "ఏమీ! సెలవుమీద వెళ్లిన మీహెడ్ ఆఫీసరుగారు ఈనెలలో వస్తారని చెప్పారుకాదూ? వారు రాలేదా ఏమిటే?"

"లేదు వారు రాకపోవడం అట్లా ఉండగా, ఇప్పుడు మాప్రాణాలు తీస్తూవున్న ఈకంటకుడే ఇంకా మూడునెలలవరకూ ఉంటాడట. దరిద్రులమైన మనవంటియల్పుల సంకల్పాలకే ఎన్నో ప్రతిబంధకాలు గలుగుతూ వుంటాయి."

ఇందులకు జవాబుగా ఆమెముఖంద్వారా నిరాశాపూర్ణమైనదైన్యాన్ని జూపించింది కాని నోటివెంట నేమియు పలుకలేదు. రెండునిముషాల పర్యంతం మౌనమూనియుండి అనంతర మీమె యాప్రసంగమును మార్చి, "కానీండి! స్నానం చేస్తురు గాని రం"డని పెరట్లోనికి దీసుకొని పోయింది.

మానవునకు ప్రయత్నావస్థలో గనుపించే సుఖం ఫలితావస్థలో గన్పించదు. నిద్రాహారాలకు తిలాంజలులిచ్చి, రాత్రిందివము లనేవిభాగాలను సైతం మరచి, యూనివర్సిటీ డిగ్రీలనిమిత్తం నిరంతర ప్రయత్నాలు సలుపుతూ వుండే భారతీయవిద్యార్థుల కీవిషయమందలి నిజానిజాలు బాగా తెలిసివుంటాయి. దైవమిచ్చిన వరంలాగు ఆదివారం వస్తూఉంది, ఆనాడు తప్పకుండా ఆపని చేసి

తీరాలి, యీపని జేసి తీరాలి, అక్కడి కెళ్లాలి, ఇక్కడి కెళ్లాలి, వారిని చూడాలి, వీరిని చూడాలి అని లేనిపోని పనులను ఎన్నింటినో కల్పించుకొని దాని కోసం ఎదురుచూస్తూ ఉంటే, చివరకు రానేవచ్చి తెలియకుండా ఎగిరిపోతుంది ఏనిద్రలోనో, ఏప్రసంగంలోనో, ఏ ఆలస్యంలోనో, లేక ముందు దలపెట్టని ఏఅనవసర కార్యంలోనో. ఇక్కడ మరింతవిచిత్ర మేమిటంటే, పని తొక్కిళ్లకింద బడి నలుగుతూఉండడం మూలాన్ని తక్కిన వారాలన్నీ యీప్రకారంగా గడచిపోతున్నాయిగదా అని గోచరమైనా అవుతాయి. కాని ఈ ఆదివారం ఎటునుంచి వచ్చి ఎటు పోయిందికూడా తెలియదు. గోపాలరావు ఎన్నెన్నో పనులను తలపెట్టుకొని వచ్చినాడు కాని ఆనాడు వక్కటీ జరిగిందికాదు, ఇతను ఆలోచించుకొని వచ్చినప్రకారం. తమ మనోరథాలు నెరవేరకపోయెనే అని ఈదంపతులకు కలిగిన దుఃఖమే ఇందులకు కారణము. దినమంతా వీరికి ఒకరినొకరు ఓదార్చుకొనడం తోటే సరిపోయింది. మరునాటి సోమవారపు ఆఫీసు సింహంలాగు తలపులోనికి రావడం మొదలెట్టింది. సాయంకాలం ఆరుగంటలకు అవటినుంచి బయలుదేరితేనే కాని రాత్రి ఎనిమిదిగంటల రైలుమీద ఎక్కి తెల్లవారి ఏడుగంటలకు మద్రాసు జేరుకోలేడు. అప్పటి రయిళ్ల రాకపోకలు ఇప్పటిలాగు లేవు. తూర్పుతీరంగా మద్రాసునుంచి బెజవాడకు కొత్తగా లైను వేసినరోజులవి పెనిమిటి వెళ్లవలసిన సమయం సమీపిస్తున్న కొలదీ సీతమనసులో ఆరాటం ఎక్కువ గాసాగింది. భర్తతోగూడ వెళ్లి ఒకచోట కలిసివుందామని ఎన్నాళ్లనుంచో ఉవ్విళ్లూరుతూ ఉంటే_ మనసులోని కోరిక నెరవేరడానికి తగినసమయం చాలా దూరంగా ఉన్నా అంతచింత ఉండదు—కాని తీరా దగ్గిరికి వచ్చినలాగే వచ్చి చేతినుండి జారిపోయినందున ఈమెకు సహింపనలవికాని ఆవేదన ఆరంభమైనది. అయిదు గంటలు దాటినపిమ్మట ఏదోకొంచెం సయించిన మట్టుకు ఎంగిలిపడి, ఎవరినో మిత్రునిజూచి రావలెననీ, స్టేషనుకు బోవడానికి కూలీకి చెప్పివస్తానని గోపాలరావు వెలుపలికి వెళ్లాడు. ఇదివరలో ఇత డీలాగున రావడం వెళ్లడం ఎన్నిసార్లో జరిగాయి. కాని దైవచిత్ర మేమిటో తెలియదు, ఈపర్యాయ మీామెకు అసహ్యావేదన జనించింది. పెనిమిటి వెలుపలికి వెళ్లగానే అన్నమైనా తినక తనగదిలోనికి పోయి ఏడుస్తూ కూర్చున్నది. కొంచెం సేపట్లో గోపాలరావు తిరిగి వచ్చినాడు. ఇతని రాక ఈమె దుఃఖాగ్నికి ఇంధనము గా విలపిస్తూ లేచి నిలుచుంది. వెంటనే ఇత డామెను సమీపించి మంచం మీద తనప్రక్కను గూర్చుండబెట్టుకొని, మెల్లగా కంటి నీరు తుడుస్తూ అనునయింపవలెనని ప్రయత్నంజేశాడు కాని,అట్లుగాక శోకావేగ మెక్కువై యతనివక్షఃస్థలము మీద బడి పిల్లలాగు ఏడువసాగింది. అంత నితడు ధైర్యము చిక్కబట్టుకొని,

"సీతా! నీ వీలాగు చేస్తావని నే నెప్పుడూ అనుకోలేదు. ఇప్పటినీస్థితిని చూస్తే నాకు మతి పోతూఉంది. ధైర్య మాగడంలేదు. నీ విక్కడ ఏలాగో ఇంటిపట్టున సుఖంగా ఉన్నావనేసంతోష మే కామూ, నన్నక్కడ సకలమైన వెట్టిచాకిరీ చేయిస్తూఉన్నది. ఈలాగు నీవు దుఃఖిస్తూ ఉంటే నాకు కాళ్లాడుతాయా? ఏమైనా చేయగలనా? నాకుమాత్రం నిన్ను వదలిపెట్టి ఉండాలనని అభిలాషా? సీతా! దరిద్రులం మన మేమి చేయగలము? రెక్కలాడినగాని డొక్కలాడవు. ఇక్కడే వుందామంటే, అది నా కెంతమాత్రం మనసుకు నచ్చడం లేదు. మనయిద్దరి కేమీ తక్కువ లేకుండా వూరివాళ్లు జరుపుతారే అనుకో. ఆప్రకారం ఉండడం మనకు భావ్యమా? మనపూర్వులంటే కర్మనిష్ఠులై ఉండినందున వారివల్ల వీరికే పనిపడుతూ ఉండేది. కాబట్టి వీరివల్ల వారూ సహాయం పొందుతూవచ్చారు. నా కాలాటి విద్యలేమీ రావుగదా! ఊరక కూర్చుండి వీరినుండి తీసికోడానికి మనసొప్పక, ఏలాగో కొన్నాళ్లపర్యంతం ఇద్దరం కష్టపడితే తరువాత దైవమనుగ్రహింపకపోతాడా అని ఈపనికి బూనుకొన్నాను గాని, నాప్రాణమా! నిన్ను వదలిపోయి దూరంగా ఎక్కడో ఉండవలసివచ్చినందున నే నెంతవిలపిస్తూ ఉంటానో పరమాత్మకే తెలుసు. నీకివన్నీ తెలియవూ? ఇదివర కెన్నోసార్లు నీవే నాకు ధైర్యం చెప్పావు. ఇవ్వాళ ఎందు కీలాగు అధైర్యపడడం? నిన్నీ

ప్రకారం వదలిన ఒక్క అడుగైనా నాకు ముందుకు సాగుతుందా?"

అని తన యుత్తరీయంతో ఆమె కన్నీరు ఒద్దుచూ ఓదార్పుచూపినను ఉపశమింపక అదేవిధమున బాష్పములు విడుస్తూ,

"నా కన్నీరు తెలుసును కాని ఏమి కారణమో ఇవ్వాళ మీరు బయలుదేరి వెళ్లుతారనుకోగానే నాకు సహింపజాలనివేదన కలుగుతూ ఉంది. నాకు మళ్లీ మీదర్శనమౌతుందో కాదో అని భయం వేస్తున్నది. మందభాగ్యను, నాగతి ఏం కానున్నదో నాథా! నన్ను మరచిపోకండేం! నన్ను మరచిపోవద్దు—మరచిపోవద్దు—"

అని ఏడుస్తూ అతని పాదములమీద పడిపోయింది.

మొదలే శిథిలమైయున్న గోపాలరావుధైర్యమంతటితో ఎటు పోయిందో తెలియదు. కళ్లనీళ్ల పర్యంతముగా నితడామెను చప్పున లేవదీసి తన యంకతలమున గూర్చుండ బెట్టుకొని,

"సీతా! నీ వీరోజున నామనస్సును చెదరగొట్టినావు. దానిని కూడబట్టుకొన నాతరంగాదు. నన్ను వెళ్లమన్నావా? వద్దన్నావా?"

అని శోకిస్తూ యామె మీద వ్రాలిపోయ్యాడు. కొన్ని నిముషములవరకూ ఇద్దరకూ బాహ్యస్మృతి లేదు. చేతనారహితులవలె నట్లు మైమరచిపడియున్న తరుణమున కూలివాడు వచ్చి, "పంతులుగారు ప్రయాణానికి సిద్ధంగా ఉన్నారా?" అని పిలువ మొదలిడగా వీరికి మరల స్మృతి కలిగింది.

3

గోపాలరావు మద్రాసుకు మరలివచ్చి మూడు రోజులు గడచిపోయినాయి. శరీరం అమ్ముకొని ఉన్నందువలన ఏలాగో ఒకలాగు అవయవసంచాలనం చేయకపోతే వీలులేదు. కాబట్టి యథాపూర్వం ఆఫీసుకు వెళ్లి తనడ్యూటీని నెరవేరుస్తూవచ్చినాడు. కాని ఇతని ప్రస్తుతస్థితి పూర్వంలాగు లేదు. స్వగ్రామంనుంచి తాను బయలుదేరి వచ్చేసమయాన్ని ద్వారంలో నిలిచిచూస్తూ ఉండిన తనప్రియుర్హాలి శోకపరీతదీనాకృతి ఇతని కనుక్షణం ప్రత్యక్షమౌతూవచ్చింది. ఇదివరకెన్నడూ ఇతని కీలాటిదశ కలిగియుండలేదు. ఎంత సమాధానపరచుకొన్నప్పటికీ శక్యంగాక మనస్సున కేదో విపరీతాందోళనం కలుగుతూవచ్చింది. సర్కారుపనినిదప్ప మరిదేనిని జేయడానికీ తోచదు. ఉత్సాహమెక్కడో పోయి దానిస్థానం విన్నదన మాక్రమించింది. ఎప్పటిలాగే గురువారం నాడు ఆఫీసుకువెళ్లాడు. నెలాఖరవడంవల్ల ఆఫీసులోని పని ఎక్కువకావడం అలా ఉండగా మరొక్ల క్లెర్కొకరో సెలవుదీసికొని పోతే అతనిపనికూడా ఇతనినెత్తిమీదే పడింది.

ఆపనిజేసితీరాలిగాని వల్లకాదనడానికి వీలులేదు. ఎదురాడినయెడల అసలు స్వంతనౌకరీకే మొప్పంవస్తుందనీ ఇష్టం ఉన్నా లేకపోయినా విసుక్కుంటూనో కసుక్కుంటూనో మీదపడిన పనినిజేస్తూనే ఉంటారు ఈ శ్రేణివారు. ఈలాటి ఎన్నిచాకిరీలనో చేస్తేనేగాని పైఅధికార్లహృదయాలు మెత్తబడవు. సుమారు పదీ, పదిన్నరగంటలయ్యేసరికి ఇతడా సెలవుపుచ్చుకొనివెళ్లిన గుమాస్తాగారి కాగితాలనుగూడా పట్టుకొనివచ్చి తన బల్లమీద పడేసి కూచోవలెనని ఆలోచిస్తూవుండగానే టెలిగ్రాఫ్ జవానొకడువచ్చి గోపాలరావెవరని అడిగి తెలుసుకొని ఈయనను సమీపించి ఒక టెలిగ్రాంయిచ్చి వెళ్లిపొయ్యాడు. నిల్చున్నవాడు నిలుచున్నపాళంగానే కవరు చించి చూచేటప్పటి కేముంది?—

" Your wife attacked cholera; come atonce—" "నీభార్యకు కలరాతగిలింది. వెంటనేరావలసింది." అని వున్నది.

టెలిగ్రాం చూచేటప్పటికి ఇతనికాపాదమస్తకం శరీరంకంపమొందసాగి ముచ్చెమ్మటలు గ్రమ్మాయి. నేత్రములవెంట అవిరళధార లుద్భవింప మతిహీనునివలె ఏడుస్తూ హెడ్ క్లర్కుగారిగదిలోనికిబరువెత్తుకొనిపోయి ఆయనముందా టెలిగ్రామును బడేసి, చేతులుజోడించుకొని,

"అయ్యా! నాయం దనుగ్రహముంచి నాకు సెల విప్పించండి. నే నిప్పుడే బయలుదేరిపోయి 11½ గంటల రైలుమీద మాగ్రామం వెళ్లుతాను. నాభార్యకు కలరా తగిలిందట - కళ్లనైనా చూస్తానో చూడనో ప్రాణం ఉండగా; నాకు సెలవు దయచేయండి." అని మహా దీనంగా వేడుకొంటే,

"ఇంత అవాంతరంగా వచ్చి అడిగితే నే నేమి చేయగలనూ? మీకు తెలియదా? దొరగారి ఆర్డరు లేందే ఎవరికీ ఏం చేయడానికీ వీల్లేదనీ,—వారింతవరకు ఆఫీసుకు రాలేదు — మీరు వెళ్లి మీపనిని చూసుకోండి, దొరగారు రావడంతోటే వారి ఉత్తరువును పొంది వెళ్ల వచ్చును."

"అయ్యో! అప్పటికి నాకీరైలు దొరుకుతుందా? అయ్యా! తగిలిన రోగం కలరా—ఇంకోటి ఇంకోటి కాదు. ఈరైలు తప్పితే సాయంకాలం దప్ప మరోటి లేదు. నాయందు దయ ఉంచండి. నాప్రార్థన మాలిం చండి. ఈదీనుని ఇల్లు నిల్పండి. మీచేతు లంటి వేడుకొం టాను. నాకీ భిక్ష పెట్టండి."

అని యతనిచేతుల గ్రహింపబోవగా నివ్వక,

"ఏమి టీ అఘాయిత్యం—ఆడదానిలాగు ఏడు స్తూనూ! ఏవో రెండు విరోచనా లైతే అక్కడివాళ్లు భయపడి నీకీ టెలిగ్రాం ఇచ్చివుంటారు. ఇంతమాత్రం ధైర్యం నిలుపుకోలేవేమిటీ, దొరగారు వచ్చినతరువాత అడిగి పోవచ్చునయ్యా అంటేనూ?"

"అయ్యా! ఇంకోఇంకో రోగం కాదు. ప్రాణా లు తీసుకొనిపొయ్యే రోగం. అబద్ధాలుకూడా ఈలాటి వెవరైనా యిస్తారా? నామనవి ఆలకించండి. నన్ను రక్షించండి! అయ్యా! నాయింటిదీపం నిల్పండి. మీ కాళ్లు పట్టుకొంటాను. నన్ను పోనివ్వండి."

అని ఏడుస్తూ కాళ్లమీద బడబోవగా వెనక్కులాక్కొని,

"దొరగారి అనుమతి లేందీ నేనేమి చేయలేను; నిశ్చయం—పూర్వముండిన దొరైనా కాదు. ఇప్పటి వీరి స్వభావ మేలాటిదో అందరికీ తెలుసును. చూస్తూచూస్తూ నాకంతానికి ఉరిదెచ్చుకొనే మార్గం నేను చేసుకోజా లను. క్షమించండి."

అని కఠినముగా పలుక నిక చేయునది లేక ఏడుస్తూ ఇతడు తనచోటికి వచ్చినాడు. ఆహా! ఇంతకంటె ఘోరమైన దేదైనా ఉందా లోకంలో! తన భాగధేయ మని, తన పాలిటిదేవి యని, తన సౌఖ్యమున కాలవాల మని, తననిధానమని, తన సర్వస్వమని నిరంతర మెవరిని తలచుకొనుచుండెనో, ఎవరి విషయమై యాతడన వచ్చిన నాటినుండి దుఃఖిస్తూ ఆమెకు సౌఖ్యారోగ్యముల బ్రసా దింపుమని ఈశ్వరుని ప్రార్థించుచుండెనో, ఎవరికి రవంతబాధ కలిగిన లోకమే మునిగెనని తలచునో అట్టి తన యర్ధాంగలక్ష్మి ప్రాణాంతకరోగమునకు గురియై ఎక్కడో పడివుండి క్షణక్షణం తన్ను కలవరిస్తూ పలవ రిస్తూఉంటే, తనదేవిని అవసానకాలమందైన చూచు కొనుటకు అవకాశమిచ్చింది కాదు ఈపాపిష్టి నాకరి. తన ప్రాణపదమైన తన్వంగి ప్రాణనిర్యాణ వేళలందు చెంత నిలిచి గొంతుకలో నింత నీరు పోయుటకైన సెల విచ్చింది కా దీదౌర్భాగ్యపు నాకరి.

రవంతమాటలాడగలిగినది మొదలుకొని మనంచేసే ప్రయత్నాలన్నీ ఈలాటి పాడునాకరీలకొరకే. మన మనుభవించే యాతనలన్నీ ఈలాటి దయాశూన్యములైన కటికనాకరీలకే. ఇటువంటి అధికారివర్గముల అడుగుల క్రిందబడి నలుగుటకొరకే. వేలకొలది ద్రవ్యమును ఖర్చు బెట్టి తుదకు బికారు లయ్యేది ఈలాటిదాస్యపదవుల కొరకే. మనబలాన్ని, మన ఆరోగ్యాన్ని, తుదకు మన శరీరాన్ని బలియిచ్చేది ఈలాటి సేవాపరనామక దేవత కొరకే—అయ్యో! ఎంత శోచనీయమైన, ఎంత నీచమైన, ఎంత హేయమైనస్థితీ మనభారతీయులదీ! గోపాలరా వక్కడ ఏడుస్తూ పడివుండగానే గడియారం 11½ దాటి పోయింది; దానితో ఇతని ప్రాణాలుకూడా సగ మనుగ మించాయి. స్వశరీరంమీద సహితం వెగటుపుట్టే ఈలాటి సమయంలో పనిచేయడ మేలాగున? కాని ఈ ఆఫీసుల్లో చేయక విధిలేదు. ఇచ్చినపనిని చేసితీరాలి, చచ్చితీరాలి. ఏదేవతానుగ్రహమైనా కలిగితే యమపాశాలనుంచికూడా

ముక్తి కలుగుతుంది కాని ఈ ఆఫీసుద్యూటీ పాశాలనుండి విడిపించడానికి వారూ అసమర్థులే.

ఒకొక్కప్పుడితనికి దేహస్మృతి తప్పుతూవుంది; ఒకొక్కప్పుడు సర్వం అంధకారమయం: సుమారు మూడు గంటలవేళకు దొరగారు పత్నీసమేతులై మోటారుపై విచ్చేసి ఆఫీసు నలంకరించారు. దొరసాని గారు వారి నక్కడ సుఖాసీనుని గావించి తాను వేరేపని మీద వెళ్లిపోయింది. దాసానుదాసులందరు వందనా లర్పించుకోవడా లయిపోయినాయి. ముందగత్యంగా దొరగారితో మనవిజేసికోవలసిన విన్నపములకై కొంతకాలం పట్టింది. అన్నీ అయినతరువాత హెడ్ గుమాస్తాగారు జడుస్తూజడుస్తూ చేతులను వెనకకు దీసి కొని, కొంచెం ముందుకు వంగి దీనస్వరంతో గోపాల రావుసంగతి విన్నవింపగా, దొరగారు చీదరించుకొంటూ–

"You uxorious Indians; always concocting letters, telegrams and useless stuff of this kind only to go and play with your wives. Well sir, go and tell him that he cannot leave the office without finishing the work allotted to him."*—

"మీ హిందువులంతా అతిస్త్రీలోలులు. ఎప్పుడూ ఈలాటి వుత్తరాలనూ టెలిగ్రాములనూ, వెధవవంకలనూ కల్పిస్తూ వుంటారు, సెలవు దీసుకొనిపోయి భార్యలతో ఆడుకోడానికి. మంచిది, మీరు వెళ్లి ఈవేళ ఆయనపని పూర్తికానిదీ ఆఫీసు వదలడానికి వీలుకాదని చెప్పండి."

ఇక మళ్లీ దొరగారి ముందు నోరెత్తడానికి వీరికి గుండెక్కడ? కిక్కురు మనకుండా అక్కడినుంచి బయ టికి వచ్చి ఆసంగతిని తెలియజేశాడు కాని ఈయనపల్లో నితడు పనిచేసేదేమిటి? అంత నితనికి సాయంచేయ డానికి స్నేహితులైన కొందరు గుమాస్తాలు ముందుకు రా పని కేదోవిధంగా సర్దుబాటైంది కాని దొరగారు కచేరీ వదిలేవరకూ ఇతని కాఫీసు వదలడానికి వీలుకా లేదు. దొరసానిగారు మోటారు తెస్తేనేకాని దొర గారికి వీలులేదు కచేరీవదలడానికి. గోపాలరావు దుర దృష్టమో అంటూ ఆనాడు దొరసానిగారు తిరుగ రావ డం పూర్వం ప్రతిదినం కంటే ఆలస్యమైంది. తుద కా విడగారు వేంచేసి దొరదొరసాను లిద్దరు వెడలిపోయిన తరువాత ఇత డాఫీసు వదలునప్పటికే 5 గంటలు కావ చ్చింది. ఇద్దరు మిత్రులుకూడ వెంటరా చావుపరుగుతో వచ్చి సెంట్రల్ స్టేషన్‌లో బడ్డాడు కాని లాభ మేముందీ! అయిదు నిముషాలకు పూర్వమే బండి బయలుదేరి పోయింది. జీవచ్ఛవంలాగు ఇతడు భూమిమీద పడి పోయినాడు. వెంట నున్నవారు మధ్యనే పట్టుకొనబట్టి గాని లేకపోతే అప్పుడే ఇతని ప్రాణాలు పొయ్యేవి. ఈఘటనంతో నితనికి భార్యను చూడగలననే ఆశ బొత్తి గా పోయింది. మళ్లీ పట్నంలోకి పోకపోవడం అట్లా వుండగా పచ్చిగంగైనా పుచ్చుకోలేదు. ఏడుపులతో, పెడబొబ్బలతో, కలవరింతలతో రాత్రంతా అక్కడే గడిపాడు. మర్నాడు తెల్లవారు గట్లే ఏలాగైతేనేం, అయిదుగంటల బండిలో పడేశారీ శరీరాన్ని మిత్రులం దరూ గలసి, గార్డుగారి పరంజేసి.

౪

శుక్రవారం మిట్టమధ్యాహ్నం పన్నెండుగంటలు దాటిపోయినాయి. ఆకాశంలో ఎటువేపు చూసినా తిల మాత్రం మబ్బుకూడా కనిపించడం లేదు. ఎండ నిర్ధా మధామంగా ఫెళ్లుమని కాస్తూఉంది. మలకలచెరువు గ్రామమంతా జనశూన్యం. ప్లేగుపడిన గ్రామంలాగు, నిప్పుల గురిపించే జ్వాలాముఖీపర్వతం క్రింది పట్టణం లాగు, రణక్షేత్రమధ్యమున జిక్కినపుటభేదనంలాగు, ఊరంతా కళావిహీనమై పాడుపడిన దానివలె గనబ డుతూ ఉంది. ఇందులకు కారణ మేమి టంటారా?

* యూరోపునివాసుల కిట్టి దురభిప్రాయాలుకలుగుటకు కారణం హిందువులే. అందులో పరిపుష్టవేతనభోక్త లగు బొజ్జకనకయ్యలే స్వార్థసిద్ధికై యీలాటిదుర్వ్యవహారముల నవలంబించి ధనాఢ్యులగుటచేత నిరపాయంగానే గడ తేరిపోతూ ఉంటారు; కాని యీ దుర్నీతుల పరిణామాలన్నీ సామాన్యగుమాస్తాలనెత్తినే పడుతూవుంటాయి.

రండి! పూర్వోదాహృతమైన చెరువు దగ్గిరకు వెళ్లితే అన్నీ మీకే తెలుస్తాయి. అదిగో ఆచెరువుకట్టకు దానికి దిగువగానున్న వరిమళ్లకు మధ్యమందున్న శ్మశానమంతా స్త్రీపురుషులతో కిటకిటలాడుతూ ఉంది చూడండి. వీరిలో విలపింపనివారు ఒక్కరూ కానరారు. గ్రామంలోని ఆబాలగోపాలం జనమంతా నిరభ్యంతరమైన తీవ్రాతపంలో తలలు మాడుతూఉంటే, కింద కాళ్లు కాలుతూ ఉంటే, దానిని గమనింపనైన గమనింపక, పొంగిపొంగివచ్చే దుఃఖావేశాన్ని ఆపుకొనజాలక కళ్లవెంట నీరుగారుస్తూ, మధ్యమందలి కాష్ఠంమీద బరుండబెట్టబడి ఉన్న జీవరహితమైన సీతాశరీరమును జూసి చూసి గోలుగోలున ఏడుస్తున్నారు. గ్రామవాసుల కీర్తిప్రతిష్ఠల కాలవాలమైన ఈసతీ తిలకముయొక్క పంచప్రాణమయమైన విహంగము నిన్న 11 గంటలకే ఎగిరిపోయింది. ఈపవిత్రశీలకు రోగ మారంభమైనది మొదలుకొని చుట్టుప్రక్కలనున్న స్త్రీ పురుషులందరూ దగ్గిర కనిపెట్టుకొని ఉండి లోపమనుమాట లేకుండ సకలవిధములైన సేవల, నుపచారముల గావించిరి గాని దైవము గ్రహింపలేదు. తెలివి ఉన్నంతవరకూ తన ప్రాణకాంతునే కలవరిస్తూ పోయింది. అప్పటినుండి ఇంతపర్యంతం కనిపెట్టుకొనివుండి ఈదేహాన్ని కాపాడారు గ్రామస్తులందరూ, ఆనిర్భాగ్యుడు గోపాలరావు వచ్చి ఆఖరుచూపైనా చూసుకొంటాడనీ—వీరిచ్చిన టెలిగ్రాం చూసుకొని వెంటనే బయలుదేరినట్లయితే రాత్రి పదకొండుగంటలకే రావలసింది, రాలేదు. ఒకవేళ ఆబండితప్పిపోయినప్పటికీ సాయంకాలము రైలుమీద బయలుదేరితే తెల్లవారేసరికైనా రావచ్చునని ఈ రెండో బండినికూడా చూశారు. ప్రొద్దుటి రైలుకూడా వెళ్లిపోయింది కాని గోపాలరావుజాడ లేమీ లేవు. ఇక చేసేదేమిటికి? ఇంక ఎంతసేపని చేస్తారీశవజాగరణం. బ్రతికివున్నంతకాలం మంచిగంధపుతైలములతో, సువాసనాద్రవ్యములతో, రంగురంగుల వస్త్రములతో, హృద్యములైన పదార్థములతో పోషించిపెంచిన ఈపాడుశరీరం, ఈబొమికలగూడు, ఈనరాలకుప్ప, ఈ ప్రేవులప్రోవు, ఈమాంసపుముద్ద, ఈ విణ్మూత్రములతొట్టి, ఈతోలుతిత్తి, ఆకాస్త ప్రాణం ఎగిరిపోయిందా అంటే ఎందుకూ పనికిరాదు. కొన్నాళ్లపాటేమిటి? ఒక్కదినమైనా దగ్గర బెట్టుకోడానికి వీలులేదు. మర్నాటికే దుర్గంధ మారంభమై దగ్గిరికిగూడ రానివ్వదు, ఆత్మబంధువులనైనా. ఆలాంటిసంగతిలో ఇంక ఎంతసేపని నిరీక్షిస్తారు పాపం వీరంతా-ఆఖరుకు ౧౧ గంటలకు జరిగింపవలసిన తంతువునంతా జరిగించి ఈ శ్మశానంలోనికి దీసికొని వచ్చారు. ఇక్కడగూడ అన్ని కార్యాలనూ విధ్యుక్తంగా నెరవేర్చి కాష్ఠారోహణం జేయించారు. సగోత్రులు కొందరు మండుకట్టెల నాల్గువైపుల నంటించారు గాని వెంటనే కాష్ఠం అంటుకోడానికి మారుగా మండేకట్టెలే ఆరిపోయినాయి. ఎందువల్లనో ఆరిపొయ్యాయని ఈవలకు వచ్చి మరిమో పెడుకట్టెలను ఎగాదిగ మండేలాగు చేసి వాని నమాంతంగాదీసికొనిపోయి తగిలించారు కానికాష్ఠం క్రింద పెట్టడమే తడవుగా ఆవన్నీ చప్పున చుంయ్యిమంటూ ఆరిపోయినాయి. ఏమిటే వింతయని ఏమీ తోచక, మరికొన్ని ఎండుకట్టెలనూ, చొప్పకట్టలనూ నాలుగువైపుల కాష్ఠమునకు చేర్పించి నేతిని పోయించి మండుతూవున్న కట్టెలనూ, చొప్పకట్టెలనూ పదిపన్నెండుమంది ఒక్కమాటుగ జేతబుచ్చుకొని కాష్ఠం నాలుగువైపులా ఒక్కపర్యాయంగా అంటించారు. కాని ఏమి ఆశ్చర్యమో! ఒక్క పెట్టున కాష్ఠమంతా జ్వాలామయమై పోవడానికి మారుగా నీళ్లుపడినవాని లాగున అవన్నియు క్షణమాత్రంలో ఆరిపోయినవి. ఈ సారి ఎంతో ప్రయత్నంజేసి అగ్ని నంటించి నప్పటికి ఆరిపోవుటవలన అది ఏదో అమానుషిక విగ్రహమని అక్కడ ఉన్నవారందరి హృదయములలో భయభక్తులుత్పన్నములుగా కాళ్లుచేతులు కంపమొందసాగాయి. ఇందుల కేదో మహత్తరమైన కారణమున్నదని అందరూ తలపోశారు. మిట్టమధ్యాహ్నం - ఎండ ఈడ్చియీడ్చి కొడుతూ వుంది. రివ్వురివ్వున వీచేగాలికా తక్కువలేదు. కాష్ఠానికి నాలుగైదుగజాలదూరాన్ని ఎగాదిగా మండేకట్టెలు చితికి తాకించడంతోటే నీళ్లలో ముంచినవానివలె ఆరిపోతూ ఉన్నాయి కాని ఎన్ని సార్లు ప్రయత్నించినా కాష్ఠాని కంటుకోవడం లేదు.

పెద్దపెద్ద పట్నాల్లో సైతం ఈలాటి విచిత్రవార్త వ్యాపించడానికి ఆలస్యం పట్టదు. ఇక పల్లెటూళ్ల లో లెక్కా? పదినిముషాల్లో ఈసమాచారం ఊరంతటా తెలిసిపోయింది. గ్రామంలోని స్త్రీపురుషులు ఎక్కడి పనులను అక్కడ ఉన్నవానిని ఉన్నట్లుగానే వదలి పెట్టి శ్మశానం ప్రవేశించేసరికి గ్రామం మసానంగా, మసానం గ్రామంగా మారిపోయింది. ఒకటి రెండుగంటల్లో చుట్టుపక్కల ఉన్న గ్రామాలకుగూడ ఈసంగతి తెలియగానే అనటివారలునూ తండోపతండములుగా రాగడగినందున నిక్కడేదో తిరుణాళ్ల జరుగుతూ ఉన్నలాగు గనుపించిందికాని దహనసంస్కారమని తోచలేదు. అంత ఈప్రకారం ఏతెంచిన జనబృందముల అవలోకనార్థం ఆసతీమణి సుకుమారగాత్రముపై అడ్డదిడ్డముగ పడివున్న కాష్టముల నన్నింటి దొలగింపగా సువాసినులు చల్లిన పసుపు కుంకుమలతో దోగియాడుతూ దేవీ విగ్రహంలాగు గనుబడుతూవుంది చితిమీద సీతా కళేబరము. ముగంమీద ప్రేతకళలకు మారు జీవకళ లుట్టిపడుతున్నాయి. ముకుళితనేత్ర యైన తన మనోహరుడు ఎప్పుడు తనదగ్గిరికి వచ్చునాయని ప్రార్థిస్తున్న విధమున గన్పించిన దీతన్వంగిముఖపద్మం. ఏండ్లు గడచిన స్త్రీపురుషు లందరూ ఆదివ్యాకృతిని గాంచి ఏదో అవతార మనుతలంపున శ్రద్ధాభక్తులతో, “తల్లీ! మావల్ల నేవైన అపరాధాలు కలిగిన క్షమింపు”మని చేతులు జోడించుకొని ప్రార్థింపసాగారు. దుఃఖమునకు దోడుగా ఇప్పుడు వీరందరినీ భయవిస్మయోద్వేగా లాక్రమించాయి. ఈప్రకారం నాలుగైదుగంటలు గడిచి పోయ్యాయి. ఇంకోగంటకు మద్రాసునుంచి రైలువస్తుంది. అందరిమనసులూ గోపాలరావుమీదికి పోయినాయి. ఒకవేపు ఇక్కడీప్రస్తుతావస్థ ఏలాగున పరిణమిస్తుందా అని ఆలోచిస్తూ వున్నారు. ఎవరికీ ఏమీ పాలుపోవడంలేదు. సూర్యుడస్తమించడానికి ఇక ఎంతోసేపు పట్టదు. అప్పుడున్నటు లుండి హఠాత్తుగ ప్రత్యక్షమైనాడు గోపాలరావు. ఏసమయాన్ని, ఏప్రకారం, ఎటునుంచి వచ్చిందీ ఎవరికీ గోచరంకాలేదు. వైఖరి చూస్తే స్టేషను దగ్గిరనుంచే పరుగెత్తసాగినట్లు తోస్తుంది. కట్టుకొన్న ఏకవస్త్రం దప్ప వంటిమీద మరేమీ లేదు. అదీ శరీరమంతటా గారుతున్న చెమటతో తడిసిపోయివుంది. ఇతన్ని జూసిన తత్క్షణమందరికీ ఒక్కపెట్టున శోక ముప్పొంగివచ్చింది. కళ్లెత్తి ఒకరివైపు చూడనూ లేదు, ఒకరిని బలుకరించనూ లేదు. ఆడ్డంవచ్చిన గుంపులను తోసుకొంటూ శరోన్ముక్తబాణవేగమున పరుగెత్తుకొని వచ్చి కాష్టమును సమీపించి, చూపరులందరూ ఏమి చేయునోఅని తలుస్తూ వుండగానే, “హా! సీతా” అని బిగ్గరగ కేకవేసి, చిటికవేసినంతమాత్రలో ఆశవంమీద బడిపోయినాడు. ఆక్షణముం దక్కడ వుపస్థితములై యున్న భిన్నభిన్న వ్యక్తిగతములైన ఆత్మలన్నీ ఏకత్వమూఢత్వాలను ఆవహించాయి. ఇట్లు కొన్ని క్షణములు గతించిపోయినాయి. తరువాత కొంతలడవునకు తెలివివచ్చి చూస్తే భార్యాకళేబరముపై ఇతని శరీరం పడినది పడినలాగేవుంది. కదలదూ మెదలదూ. మరింతదగ్గరకుబోయి పరికించి చూస్తే, ఏమున్నదీ? వాత్సల్యపరిపూరితమైన పతియాత్మ పత్నియొక్క ఆత్మను అనుగమించి పోయినట్లు స్పష్టమైంది.

అప్పు డక్కడ వున్నవారందరికీ అవలంబింపదగిన మరోమార్గ మేదికలదు? భార్యాభర్తల శరీరముల రెండింటిని సమములుగా పెట్టించి, చెదరిపోయి ఉన్నకట్టెల నన్నింటి బాగుగ బేర్పించి, విధ్యుక్తముగ సంసిద్ధము చేయబడిన అగ్నిని మరల దగిలించగా—ఎంత విచిత్ర మన వచ్చును! ఒక్కపర్యాయముగ కాష్టము నాల్గువైపుల జ్వాల లుత్పన్నములుగా, బూర్ణాహుతిదానంచేత పరితుష్టుడైన వానివడువున క్షణమాత్రంలో కబలించివేశాడు హవ్యవాహను డీపవిత్రాహుతిద్వయాన్ని.